స్టాళ్లు 64 వినియోగం ఒక్కటే..

లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన వడ్లపూడి మార్కెట్ యార్డును అధికారులు కాలికి వదిలేశారు. ఫలితంగా మూగజీవాలకు ఆవాసంగా మారింది. ఆకతాయిలకు వేదికైంది. లక్ష్యం నీరు గారింది. లక్షలాది రూపాయిల ప్రజాధనం వృథా అయింది. వినియోగంలోకి తేకపోవడంతో కళ తప్పి అధ్వానంగా మారింది.

- మార్కెట్ ఖాళీ
- తిష్టవేస్తున్న పశువులు
- పేరుకుపోతున్న చెత్త
- పట్టించుకోని అధికారులు



ఏకైక కూరగాయల దుకాణం



ఖాళీగా దర్శనమిస్తున్న షాపులు

కూర్మన్నపాలెం: వేలాది కుటుంబాలు నివాసముంటున్న ఉక్కు నిర్వాసిత కాలనీల్లో ప్రజలకు అన్ని రకాల కూరగాయలు, సరకులు అందుబాటులో ఉండాలని వడ్లపూడి దరి కణితి ఆర్‌హెచ్‌కాలనీల్లో మార్కెట్ యార్డు సముదాయాన్ని నిర్మించారు. 2007లో ప్రారంభమైన ఈ యార్డులోకి కూరగాయలు పండించే రైతులు, వాటిని అమ్మకాలు చేసే చిరు వ్యాపారులకు వసతులు కల్పించారు. అందుకు అనుగుణంగా వివిధ ప్రాంతాల్లో రోడ్లపై కూరగాయలు అమ్మేవారిని అక్కడకు తరలించి అక్కడే వ్యాపారాలు చేసుకోవాలని అధికారులు సూచించారు. అలాగే పంటలు పండించే రైతులు కూడా అక్కడికే వచ్చి అమ్మకాలు సాగించాలని వివిధ ప్రాంతాల ప్రజలకు సమాచారం అందించారు. ఈ మేరకు అప్పట్లో కొన్ని రోజుల పాటు మార్కెట్ యార్డు జనంతో కళ కళ లాడుతు వచ్చేది. ఆ తర్వాత అధికారులు మార్కెట్ యార్డు ఆలనా పాలనా చూడకపోవడంతో కొనుగోలు దారులతో పాటు అమ్మేవారి సంఖ్య కూడా రోజు రోజుకు పడిపోతూ వచ్చింది. ఇప్పుడు ఒకే ఒక్క షాపు మాత్రమే తెరిచి కనబడుతుంది. సుమారు 64 షాపులు ఉన్న సముదాయంలో అప్పుడప్పుడు చేపలు అమ్మేవారు మినహా నిరంతరం కూరగాయల దుకాణం ఒకటి మాత్రమే దర్శనమిస్తుండడంతో ప్రజలు మార్కెట్ యార్డు వైపు చూడడం మానేశారు. దీంతో షాపు అన్నీ ఖాళీగా ఉండి పోయాయి. చెత్తా చెదారం చేరిపోయి పశువులకు నిలయంగా మారింది. సాయంత్రం అయితే తాగుబోతులు నానా రభస సృష్టిస్తున్నారు. దీనితో అటువైపు వెళ్లాలంటేనే ప్రజలు భయపడుతున్నారు.

ఎవరిని సంప్రదించాలో?

ఒక వేళ షాపులు ఎవరికైనా కావాల్సివచ్చినా ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి అక్కడ నెలకొంది. ఊరు మధ్యలో ఉన్న సముదాయానికే దిక్కు దివాన లేకపోతే ఎలా అని పలువురు మండిపడుతున్నారు. మార్కెట్ నిర్వహణ పట్టించుకోక పోవడం వల్లే రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా వినియోగంలోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



వడ్లపూడి మార్కెట్ యార్డు



మార్కెట్‌లో దర్శనమిస్తున్న చెత్త

పదేళ్లుగా ఒక్క దుకాణమే



యార్డులోకి రైతులను రప్పించి సరకులు అమ్మకాలు సాగిస్తే యార్డు అభివృద్ధి చెందుతుంది. 10 ఏళ్లుగా ఒకే ఒక్క కూరగాయల దుకాణం నడుపుతున్నాను. ఆ దుకాణంలో తెచ్చిన కూరగాయలు వారం రోజుల వరకు అమ్ముడు కావడడం లేదు. అధికారులు కలుగజేసుకొని అన్ని షాపులు తెరుచుకొనేలా చేస్తే వ్యాపారం కూడా అభివృద్ధి చెందుతుంది.

– కర్రి సత్యవతి, కూరగాయల వ్యాపారి, వడ్లపూడి

అన్ని దుకాణాలు తెరిపించాలి



మార్కెట్ యార్డులో అన్ని దుకాణాలు తెరిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. అన్ని సరకులు లభిస్తే ప్రజలు వచ్చి కొనుగోలు చేస్తారు. ఇక్కడ దుకాణాలు లేకపోవడడం వల్ల సరుకులు దొరకవని ఎవరూ రావడం లేదు. ఒక్క ఆదివారం మాత్రమే చేపలు అమ్మేవారు కనిపిస్తున్నారు. దీన్ని డైలీ మార్కెట్‌గా అభివృద్ధి చేయాలి.

– టి. బైరాగి, ఎక్స్ ఆర్మీ,తిరుమలనగర్ వాసి

రెండు రోజులు చేపలు అమ్ముతా...



ఈ యార్డుకు ఆదివారం, మంగళవారం మాత్రమే చేపలు తెచ్చి విక్రయిస్తాను. అవికూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉంటేగాని చెల్లుబాటు కావు. ఇక్కడ మార్కెట్ ఉందన్న సంగతి చాలా మంది మరిచిపోయారు. అధికారులు చొరవ తీసుకుని అన్ని షాపులు కేటాయించాలి.

– బి. సత్యవతి, చేపల వ్యాపారి

అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు



ఆర్ఈసీఎస్ ఈఈకి వినతిపత్రం అందిస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థ ఇన్‌చార్జి రామకోటి

అగనంపూడి: సర్వీసులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచుతున్నామని ఆర్ఈసీఎస్ ఈఈ ఎస్.రామకృష్ణ చెప్పారు. బ్రహ్మకుమారీస్ అగనంపూడి ఇన్‌చార్జి రామకోటి మంగళవారం ఎస్ఈని కలిసి ఈ ప్రాంతంలోని సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ సమస్య ఉత్పన్నం కాకూడదనే ఉద్దేశంతో మంగళపాలెంలో రెండు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులు కేంద్ర ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న సోలార్ విద్యుత్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఈసీఎస్ అధికారులు జె.ప్రసాద్, కనకారావు, నాయకులు బి.సత్యనారాయణ, జి.పద్మ, కె.శైలజ పాల్గొన్నారు.

పెండింగ్ జీతాల చెల్లింపునకు సహకరించండి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల పెండింగ్ జీతాల చెల్లింపునకు సహకరించాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు మంగళవారం ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం అందజేశారు. వీఆర్ఎస్, పదవీ విరమణల వల్ల సుమారు 1600 మంది ఉద్యోగులు తగ్గిపోయారన్నారు. అదే విధంగా కాంట్రాక్ట్ సిబ్బందిని ఇప్పటికే 2000 మందిని తగ్గించారని వివరించారు. రాబోయే మూడు నెలల్లో మరో 400 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయబోతున్నారన్నారు.ఉద్యోగుల జీతాలు సెప్టెంబర్ 2024 నుంచి పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఇప్పటి వరకు సుమారు 230 శాతం చెల్లించాల్సి ఉందన్నారు. దాని వల్ల ఉన్నత విద్య కోసం రుణాలు కోసం వెళ్లిన ఉద్యోగులకు ప్రతికూల క్రెడిట్ రేటింగ్‌ల కారణంగా రుణాలు మంజూరు కావడం లేదన్నారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ జీతాలు త్వరలో చెల్లించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, పెన్షన్ వారియర్స్ ద్వారం స్వామి నాయుడు, దుడ్డు శ్రీనివాస్ జె.ఎ. స్వామి, పి. వెంకటరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెంటమాంబ.. చల్లగ చూడమ్మా



నెల్లిముక్కులో అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

పెదగంట్యాడ: నెల్లిముక్కు గ్రామ పంచాయతీ పరిధిలోని 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పెంటమాంబ అమ్మవారి ఘటాలను మంగళవారం ఘనంగా ఊరేగించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, గొందేశి సత్యారావు మాట్లాడుతూ అమ్మవారి దర్శన భాగ్యాన్ని ఈ ప్రాంత ప్రజలకు కల్పిస్తున్నామని చెప్పారు. అలాగే ఉగాది పండగ నుంచి అమ్మవారి పండగ వరకూ ప్రతి రోజూ ఘటాలను ఊరేగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎల్లేటి శ్రీనివాసరావు, గంట్యాడ పైడిరాజు, మొల్లి రమణ, పిట్ట కుంచారావు, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో జెడ్సీ పర్యటన



కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డులో మంగళవారం జెడ్సీ శేషాద్రినాయుడు పర్యటించారు. ఇక్కడ ఏంకే పార్కులో ప్రధాన కాలువలను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అవుట్‌లెట్ మూసివేయాలని సూచించారు. కార్పొరేటర్ బొండా జగన్, శానిటరీ ఇన్స్పెక్టర్ అప్పారావు,సచివాలయ సిబ్బంది నీలిమ,లలితకుమారి,సంధ్య పాల్గొన్నారు.

బెహరా కళాశాల ఆధ్వర్యంలో ఉచితంగా పాలిసెట్ కోచింగ్

గోపాలపట్నం: పదోతరగతి తర్వాత పాలిటెక్నిక్‌లో చేరేందుకు నిర్వహించే పాలిసెట్‌కు హాజరయ్యే వారికి కోచింగ్ ఉచితంగా ఇస్తున్నామని బెహరా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో 5 చోట్ల ఉచిత కోచింగ్ సెంటర్లు నడుపుతున్నామని వెల్లడించారు. గాజువాకలో వాసన్ ఐకేర్ ఎదురు భవనంలో కోచింగ్ ఇస్తున్నామని తెలిపారు. పూర్తి వివరాలకు నాగలక్ష్మిని 70138 67505 నంబర్‌లో సప్రదించాలని కోరారు. కణితి జెడ్పీ హైస్కూల్‌లో కామేష్ కోచింగ్ ఇస్తున్నారని.. వివరాలకు 90304 85833నబర్‌లో సంప్రదించాలన్నారు. గోపాలపట్నంలో వసంత నిర్వహిస్తున్నారని.. 79812 15413 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. నరం బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో నిఖిల నిర్వహిస్తున్నారని 79978 94792 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. చోడవరం ప్రేమ సమాజంలో డాక్టర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో కోచింగ్ జరుగుతుందని.. 97011 33586నంబర్‌లో వివరాలు తెలుసుకోవాలని కోరారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



జోనల్ కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న సిబ్బంది

గాజువాక: వివిధ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం గాజువాక జోనల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించి దరఖాస్తులను పరిశీలించారు. జోనల్ కమిషనర్ శేషాద్రి నేతృత్వంలో యూజీడీ సిబ్బంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. వ్యాపార వివరాలను అధికారులు తీసుకున్నారు.

డేట్ ఆఫ్ జాయినింగ్ సమస్య పరిష్కరించాలని వినతి

అక్కిరెడ్డిపాలెం: సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ , కార్మికుల డేట్ ఆఫ్ జాయినింగ్‌లో తప్పులను సరి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ భెల్ (హెచ్‌పీవీపీ) గుర్తింపు యూనియన్ నాయకులు మంగళవారం ఎంపీ భరత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కొందరికి పీఎఫ్ ఎంట్రీ 1992కు బదులు 1997గా నమోదైందని, కొందరికి 2011గా నమోదు కావడంతో హయ్యర్ పెన్షన్ రిజక్ట్ అయిందని తెలిపారు. ఈ అంశాన్ని సంబంధిత మంత్రి, భెల్ యాజమాన్యంతో చర్చించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ నాయకులు బొండ బాబూరావు, సుభాకర్ సాహూ, పి.వి.ఎస్.రాజు, కొల్లి దేముడు, టెక్కలి భాస్కరరావు, అల్లం వెంకటేశ్వరరావు, టి.ఎల్.నర్సింగరావు, అప్పలరాజు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మతల్లి అనుపు మహోత్సవం





ప్రత్యేక అలంకరణలో పరదేశమ్మ, పారాయణ చేస్తున్న భక్తులు

అగనంపూడి: అగనంపూడి పరిసర అష్ట గ్రామాల ఆరాధ్య దైవం బొర్రమాంబ జాతర మహోత్సవంలో భాగంగా మంగళవారం అమ్మవారి అనుపు మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు.

తెల్లవారు జాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు లలితా సహస్ర పారాయణం, అమ్మవారి భక్తిగీతాలాపన చేశారు. సాయంత్రం అమ్మవారిని మేళతాళాల నడుమ భారీగా ఊరేగించి అనుపు చేశారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గాజువాక: అర్హులందరికీ 30 జీవో ప్రకారం పట్టాలు మంజూరు చేయాలని, 296, 288 జీవోల ద్వారా ఇచ్చిన పట్టాలను రిజిస్ట్రేషన్ చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం డిమాండ్ చేశారు. పట్టాల అంశంపై మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో గాజువాక తహసీల్దార్ కార్యాలయం వద్ద మహాధర్నా చేశారు. లోకనాథం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అర్హులైన వారందరికీ పట్టాలు మంజూరు చేస్తామని, పట్టాలన్నీ రిజిస్ట్రేషన్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కాని నేటి వరకు అవి అమలు కాలేదన్నారు. జీవో 30 ప్రకారం స్వతంత్ర నగర్, రామ్‌నగర్ కాలనీ వాసులకు పట్టాలు మంజూరు చేయాలని కోరితే అవి చెరువులని కుంటి సాకులు చెబుతున్నారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు మాట్లాడుతూ పట్టాలిచ్చి తొమ్మిదేళ్లు అవుతున్నా నేటికీ రిజిస్ట్రేషన్ చేయడం లేదన్నారు. 296 జీవో పట్టాలో రెండు ఏళ్ల తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని స్పష్టంగా పేర్కొన్నారన్నారు. అనంతరం తహసీల్దార్ టి. శ్రీవల్లికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు, డి. రమణ, ఎ. లోకేష్, బంగారు నాయుడు, లక్ష్మి, సంతోషం, కిరీటం తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

అక్కిరెడ్డిపాలెం: పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న పచ్చికోళ్ల కృష్ణ మూర్తిని మంగళవారం గాజువాక పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పీడీఎస్ రైస్ అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో ఈ నెల 2వ తేదీన ఐఎస్ఎస్ ఏకశిల వద్ద సివిల్ సప్లై ఆర్ఐ పద్మావతి దాడులు నిర్వహించి రైస్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో రైస్‌ను అక్రమంగా తరలిస్తున్న పచ్చికోళ్ల కృష్ణ మూర్తి పరుష పదజాలంతో మాట్లాడాడని ఆర్ఐ గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరిపిన గాజువాక పోలీసులు పచ్చికోళ్ల కృష్ణ మూర్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇప్పటికే అతనిపై 9 వరకు కేసులు ఉన్నట్లు తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పూర్ణానందశర్మ, సుబ్బారెడ్డి, సుశీలా గజేంద్రరావు

అగనంపూడి: కొన్ని సంవత్సరాలుగా మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తూ సద్భావనా సేవా సంఘం ప్రతినిధులు స్థానికులు, ప్రయాణికుల మన్ననలు పొందుతున్నారని సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, సలహాదారు పట్టా రామ అప్పారావు అన్నారు. అగనంపూడి కూడలిలోని బస్టాప్ వద్ద సద్భావనా సేవా సంఘం సహకారంతో శ్రమశక్తి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పూర్ణానందశర్మ రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేపడుతూ స్థానికుల ఆదరాభిమానాలు చూరగొంటున్నారన్నారు. సద్భావనా సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జి.పూర్ణానందశర్మ మాట్లాడుతూ 12 ఏళ్లుగా ప్రధాన కూడలి, బస్టాప్ వద్ద కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాన్ని వేసవిలో మూడు నెలల పాటు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సంఘ అధ్యక్షుడు బి.సుబ్బారెడ్డి, ప్రజా సంఘాల నాయకులు కిడిమి హనుమంతురావు, యలమంచిలి అప్పారావు, ఎల్.వి.రమణ, బలిరెడ్డి సత్యనారాయణ, మడగల నరసింగరావు, చిత్తా రామారావు, బొండా ఈశ్వరరావు, నక్కా గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర కాలనీలో..

అక్కిరెడ్డిపాలెం: వేసవిని దృష్టిలో పెట్టుకుని 69వ వార్డు షీలానగర్ వెంకటేశ్వరకాలనీలో శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ప్రారంభించారు. కార్యక్రమంలో మద్దాల శ్రీనివాసరావు, కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, నాయకులు లక్ష్మప్పారావు, ఆళ్ల రాంప్రసాద్, పెంటకోట ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వరరావు, దాడి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

బాల్యం ఛిద్రం.. వ్యర్థం



పిల్లలందరితో కలసి బడిలో ఆటపాటలతో గడపాల్సిన ఎందరో చిన్నారులు వ్యర్థాల నడుమ ఇలా ఛిద్రమవుతోంది. పెదగంట్యాడ దరి స్వతంత్రనగర్ సమీపంలోని డంపింగ్ యార్డ్‌లో పలు ప్రాంతాల నుంచి చెత్త సేకరించి డంప్ చేస్తుంటారు. పక్కనే ఉన్న కాలనీల్లో బలహీన వర్గాలకు చెందిన కొన్ని కుటుంబాలు చిన్న చిన్న ఇళ్లలో జీవనం సాగిస్తుంటారు.. వీరి వృత్తి వ్యర్థాలు సేకరించడం, చిన్న చిన్న పనులు చేచడం. అయితే వీరి పిల్లలు తల్లిదండ్రులతో పాటు రోడ్ల వెంబడి, డంపింగ్ యార్డ్‌లో చెత్తా చెదారంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తూ అదే బాటలో నడుస్తూ బాల్యాన్ని వ్యర్థాలకు అంకితం చేస్తున్నారు.దుర్గర జీవితం గడుపుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం మండుటెండలో పెద్దలతో కలసి పలువురు చిన్నారులు వీపు వెనక గోనె సంచి తగిలించుకుని ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుకోవడం కొంతమంది చూపరులను కలచివేసింది.

– పెదగంట్యాడ

అకాల వర్షం



పెదగంట్యాడలో కురుస్తున్న వర్షం



వర్షంలో వాహనచోదకుల ప్రయాణం

పెదగంట్యాడ: మండు వేసవిలో కురిసిన అకాల వర్షం ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం ఇచ్చింది.మంగళవారం రాత్రి ఆకాశంలో మేఘాలు కమ్ముకోవడంతో ఉరుములు మెరుపులతో కొద్దిగా గాలులు వీచాయి. చిన్న చిన్న జల్లులు పడిన వాన ఒక్కసారిగా పెరిగి సుమారు 45 నిమిషాలు కురిసింది. దీంతో వాహన చోదకులు, పాదచారులు వర్షంలోనే ప్రయాణించారు.అకాల వర్షానికి కొన్ని చోట్ల మురుగు రోడ్ల పైకి వచ్చి రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

వంటగ్యాస్ ధర తగ్గించాలంటూ సీపీఐ వినూత్న నిరసన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సీతమ్మధార: పెంచిన గ్యాస్ ధరను తక్షణమే రద్దు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. గ్యాస్ బండ నెత్తిన పెట్టుకుని ఆందోళన చేశారు. అనంతరం మహిళలంతా కలిసి కట్టెల పొయ్యిపై వంటావార్పు చేశారు. దేశవ్యాప్తంగా వంట గ్యాస్ సిలిండర్ ధరలను కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచడాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. దానిలో భాగంగా మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ గృహావసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్పీజీ గ్యాస్ బండపై రూ.50 చొప్పున పెంచడం వల్ల పేద ప్రజలపై మరింత భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వంట గ్యాస్ ధర పెంపుతో సాధారణ వినియోగదారులు, ఉజ్వల పథకం లబ్ధిదారులు ఒక్కో బండపై అదనంగా రూ.50 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వెంటనే పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, ఎస్‌కే రెహమాన్, పి.చంద్రశేఖర్, ఎం.మన్మథరావు, జి.రాంబాబు, సీఎస్. క్షేత్రపాల్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు జేడీ నాయుడు, ఎ. దేముడమ్మ, జి. జయ, పి. సూర్య పద్మ, బి. పుష్పలత, ఎస్. నాగభూషణం, పి. గోవింద్, ఆడారి ఆదినారాయణ, ఎం .శ్రీనివాసరావు, జె .అన్వేషి, రాంప్రభు, హేమంత్ పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు తగ్గించాలి



ఆటో డ్రైవర్లతో కలిసి ఆందోళన చేస్తున్న వామనమూర్తి

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచిన గ్యాస్,డీజిల్, పెట్రోల్ ధరలు వెంటనే రద్దు చేయాలి ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ కార్మికుల మీద ఆర్థిక భారాలు వేసే విధంగా డీజిల్ పెట్రోల్ వంట గ్యాస్ ధరలను భారీగా పెంచి ఆర్థిక భారం మోపిందన్నారు. మంగళవారం ద్వారకా నగర్ జంక్షన్ వద్ద ఆటోడ్రైవర్లు నిరసన ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వామనమూర్తి బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్ మోటార్ వాహన డ్రైవర్లు నిరసన ధర్నా చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కళ్లు తెరిపించాలని డ్రైవర్లకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యు. శివాజీ, దేవుడు, ఈశ్వర్, రావి కృష్ణ, మురళీ తదితరులు పాల్గొన్నారు.